క్లుప్తంగా

ఏఐబీఎస్ఎస్ అధ్యక్షుడిగా నాగునాయక్


నాగునాయక్

మదనపల్లె: ఆల్ ఇండియా బంజారా సేవా సమితి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా మదనపల్లెకు చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బుక్యా నాగునాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బి.చిక్రేనాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనతోపాటు జిల్లా కార్యదర్శిగా బుక్కే శంకర్ నాయక్‌ను నియమించారు. నాగునాయక్‌ను పలుసంఘాల ప్రతినిధులు అభినందించారు.

క్యాన్సర్ బాధితుడికి సాయం


బాధితుడికి నగదు అందజేస్తున్న స్వాతి

మదనపల్లె సిటీ: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నమండ్యం మండలం కొండమూలకు చెందిన నాగయ్యకు ధాత్రి ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ స్వాతి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. స్థానిక ధాత్రి కార్యాలయంలో బాధితుడికి గురువారం ఆ నగదు అందజేశారు. ఇప్పటికే రెండు ఆపరేషన్లు చేశారని, మరో ఆపరేషన్ కోసం రూ.6 లక్షలు వ్యయం అవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు. 8186099919 ను సంప్రదించి ఆదుకోవాలన్నారు.

ఈకేవైసీ చేసుకోవాలి

కురబలకోట: ఉపాధి హామీ వేతనదారులు వెంటనే ఈకేవైసీ చేసుకోవాలని ఉపాధి హామీ మండల ఏపీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. నకిలీ హాజరు ఒకరి కార్డుపై మరొకరు పనిచేయడం వంటి అక్రమాలను నిలువరించే ఉద్దేశ్యంతో ఆధార్, జాబ్‌కార్డు లింక్ తప్పనిసరి చేస్తూ కేంద్రం కొత్త నియమం తీసుకు వచ్చిందన్నారు. మొబైల్ యాప్ ద్వారా ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా ఈకేవైసీ చేస్తున్నట్లు తెలిపారు.

నెట్‌బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకీపురం మండలం కొత్తమంచూరు జెడ్పీ పాఠశాల విద్యార్థినులు అపర్ణ, అలేఖ్య, గాయత్రి అండర్–19 నెట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వి.ప్రకాష్ తెలిపారు. సీటీఎం జెడ్పీ పాఠశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో జరిగిన నెట్‌బాల్ పోటీలలో ఈ విద్యార్థినులు సత్తా చాటి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థినులను హెచ్ఎం అభినందించి...పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. పీడీ రెడ్డివర ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శోభ

నిమ్మనపల్లె: దినసరి, ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి కే.శోభా కోరారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దారు తపస్విణి, ఎంపీడీఓ రమేష్‌బాబులను గురువారం ఆమె కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అక్టోబర్ 2వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించామన్నారు. పేదలకు భూములు పంచాలని, దళిత వాడల్లో శ్మశానాలకు స్థలం కేటాయించాలని కోరారు. రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని, అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు అందించాలని సూచించారు. మండలంలోని పిట్టావాండ్లపల్లె, కొత్తపల్లె దళితవాడకు శ్మశానం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూనియన్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కలికిరి: జీవన ఎరువుల వినియోగంపై స్థానిక కేవీకే కార్యాలయంలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే కో–ఆర్డినేటర్ మంజుల మాట్లాడుతూ జీవన ఎరువులైన అజోల్లా, రైజోబియం, అజటో బాక్టర్, పాస్పేట్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా, పోటాషియం వంటి వాటిని పంట పొలాల్లో ఉపయోగించి పంటకు అవసరమైన నత్రజని, భాస్వరం, పోటాష్ వంటి పోషకాలను అందించవచ్చన్నారు. జీవన ఎరువుల వినియోగం, ఉపయోగాలపై తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం తెగుళ్ల విభాగం ప్రధాన శాస్త్రవేత్త విశ్వనాథ్ వివరించారు. సోమశేఖర్ బాబు, మాధురి, పీరా సాహెబ్, శ్రీనివాసులు,విద్యార్థులు పాల్గొన్నారు.

నార నాసిరకం .. రైతుకు నష్టం

పెద్దతిప్పసముద్రం: నాసిరకం సీడ్, నకిలీ విత్తనాల కారణంగా రైతులు మోసపోతూ పీకల్లోతు అప్పుల్లో కూరుకు పోతున్నారు. పంటపై ధారపోసిన రూ.లక్షల పెట్టుబడి చేతికందకపోగా కోతకు వచ్చిన పంటను పశువులకు మేతగా వేస్తూ కంటతడి పెడుతున్నారు. మండలంలోని పట్టింవాండ్లపల్లి పంచాయతీ దిగవ కుక్కలపల్లికి చెందిన రైతు రెడ్డెం చంద్రారెడ్డి పుంగనూరు సమీపంలోని యల్లంపల్లి వద్ద ఓ నర్సరీలో ఒక్కో టమాటా మొలకను రూ.90 పైసల చొప్పున రూ.8,550ల నగదు ధారపోసి కొనుగోలు చేసాడు. పొలంలో మొలకలు నాటి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. దిగుబడి వచ్చే వరకు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశాడు. కాయలను కోసి మార్కెట్‌కు తరలిస్తే ఇలాంటి రోజ్, రబ్బర్ కాయలు మార్కెట్‌కు తేరాదని యజమానులు తేల్చి చెప్పడంతో ఆవాక్కయ్యాడు. వ్యయ ప్రయాసాలకోర్చి టమాటాలను మార్కెట్‌కు తరలిస్తే 30 కిలోల బాక్సు రూ.70 మాత్రమే పలికిందని, కూలీల ఖర్చు రాక ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పుచేసి చెల్లించానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. నాసిరకం సీడ్ కారణంగా నిలువునా మోసపోయానని, హార్టికల్చర్ అధికారికి ఫోన్ ద్వారా గోడు చెబితే సెలవులో ఉన్నా.. మూడు రోజుల్లో వస్తానని చెప్పారని రైతు తెలిపారు. నాసిరకం విత్తనాలను నియంత్రించి రైతులకు ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.


వ్యాపారులు కొనకపోవడంతో రైతు పశువులకు మేతగా వదిలేసిన టమాట పంట

ప్రతిభ గల క్రీడాకారులనే ఎంపికచేయాలి

ఈ నెల 23 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు


అన్నమయ్య కళావేదికను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈఓ నాగయ్య

రాజంపేట టౌన్ : ఈనెల 23వ తేదీ నుంచి రాజంపేటలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ డివిజన్ స్థాయి క్రీడాకారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టి ప్రతిభగల క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేయాలని డిప్యూటీ డీఈఓ లంకయ్యగారి నాగయ్య తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో గురువారం డివిజన్‌లోని పీఈటీ, పీడీలతో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ డీఈఓ మాట్లాడారు. క్రీడాకారుల ఎంపికలో ఆరోపణలకు తావివ్వకుండా చేపట్టాలన్నారు. ఎంపికలకు ఇంకా సమయం ఉన్నందున కమిటీలు వేసుకొని విజయవంతం చేయాలన్నారు. పారదర్శకంగా క్రీడలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. డివిజన్‌లోని ఏడు మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. అందువల్ల క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సిబ్బందికి ఆయన సూచనలు చేశారు. ఇటీవల ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన మండల స్థాయి పోటీల్లో క్రీడాకారులకు తాగునీటి సౌకర్యం కల్పించలేదన్న ఆరోపణలు వచ్చాయని, అలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అందువల్ల డివిజన్ స్థాయి ఎంపికల సందర్భంగా క్రీడాకారులకు సంపూర్ణగా తాగునీటి వసతిని కల్పించాలని ఆదేశించారు. ఎంఈఓ–1 కొండూరు రఘునాథ్‌రాజు, ఎంఈఓ–2 సుబ్బరాయుడు, పుల్లంపేట ఎంఈఓ జి.చక్రధర్‌రాజు మాట్లాడుతూ 23, 24వ తేదీల్లో బాలికోన్నత పాఠశాల క్రీడామైదానంలో గేమ్స్‌కు సంబంధించి, 25వ తేదీ ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో స్పోర్ట్స్‌కు సంబంధించిన క్రీడాకారుల ఎంపికలు ఉంటాయన్నారు. ఈ ఎంపికలకు సంబంధించి పీఈటీలు, పీడీలు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకొని విజయవంతం చేయాలని తెలిపారు. బాలికోన్నత పాఠశాల హెచ్ఎం జయలక్ష్మి మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో నిర్వహించే క్రీడాకారుల ఎంపికలను తమ పాఠశాలలో నిర్వహిస్తుండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. తొలుత డిప్యూటీ డీఈఓ నాగయ్య బాలికోన్నత పాఠశాలలో దాతల రూ.2 లక్షల ఆర్థిక సహాయంతో నిర్మించిన అన్నమయ్య కళావేదికను ప్రారంభించారు. అనంతరం దాతలు అరవ రమణయ్య, విశ్వనాథనాయుడు, బి.అచ్యుత, వీరప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో డివిజన్ క్రీడా ఎంపికల కో–ఆర్డినేటర్ హమీద్, ఉపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ రూఫ్‌టాప్‌తో ప్రయోజనం


సీటీఎం సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న గురవయ్య

మదనపల్లె రూరల్: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద రాయితీపై అందిస్తున్న సోలార్ విద్యుత్ రూఫ్‌టాప్‌తో ప్రయోజనం ఉందని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య పేర్కొన్నారు. మండలంలోని సీటీఎం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం డైరెక్టర్ గురవయ్య పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సోలార్‌తో విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ వినియోగదారులు అదనపు లోడ్‌ను 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవాలన్నారు. లైన్ లాస్ తగ్గించడంతోపాటు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం మదనపల్లె డివిజన్ కార్యాలయానికి చేరుకుని ఈఈ గంగాధరం ఆధ్వర్యంలో సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ జ్ఞానేశ్వర్, ఏఏఓ కిరణ్‌కుమార్, ఏడీ హరికుమార్, సురేంద్రనాయక్, ఏఈ రమేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ చేద్దాం.. ప్రాణం పోద్దాం!


సీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మదనపల్లె సిటీ: ప్రస్తుత కాలంలో పిల్లల నుంచి వృద్ధుల వరకు గుండెపోటు సమస్య ఎదుర్కొంటున్నారు. వ్యాయామం లేకపోవటం, రోజువారీ ఆహారంలో తేడాలు, జంక్‌ఫుడ్ తినడంతో రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి రక్తసరఫరాను అడ్డుకోవడంతో ఈ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్య శాఖ బాధితుల ప్రాణాలను రక్షించడానికి సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీసస్కిటేషన్) విధానంపై పలువురికీ అవగాహన కల్పిస్తోంది. సోమవారం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు,రద్దీ ప్రాంతాలు, మాల్స్, జిల్లా ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు తదితర ప్రాంతాల్లో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సీపీఆర్ చేయటానికి వైద్యులే అవసరం లేదు. అవగాహన ఉన్న వారెవరైనా చేయవచ్చునని వైద్యులు పేర్కొంటున్నారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఒక్కసారిగా పడిపోతుంటారు. గుండె పనిచేయకపోవటంతో ఇలా జరుగుతుంటుంది. నిమిషాల వ్యవధిలో నిర్దేశించిన ప్రకారం బాధితుడి చాతిపై రెండు అర చేతులు ఒకదానిపై ఒకటి ఉంచి హృదయ స్పందన తిరిగి ప్రారంభమయ్యేలా నొక్కుతూ ఉంటే బతికే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి


కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు

మదనపల్లె సిటీ: పెండింగ్‌లో ఉన్న డీఏ, సంపాదిత సెలవుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ అశోక్ డిమాండ్ చేశారు. మదనపల్లె పట్టణశాఖ ఆధ్వర్యంలో గురువారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మెగా డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయుల సంఘం సభ్యత్వాన్ని తీసుకోగా వారికి సర్వీసు రిజిష్టర్లు అందజేశారు. అశోక్ మాట్లాడుతూ నూతన పీఆర్‌సీ కమిటీ ఏర్పాటుచేసి మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించకపోవడం విచారకరమన్నారు. చిత్తూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న తెలుగు, హిందీ, ఉర్దూ బాషాపండితులకు పదోన్నతి కల్పించాలన్నారు. మున్సిపల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు విద్యకు దూరం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు శ్రీనివాసులు, ఆనంద్ రెడ్డి, హరిప్రసాద్, సురేష్‌కుమార్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి, శివకుమార్, హరిబాబు, సమీవుద్దీన్, ఆర్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల చేతుల్లోనే ప్రజారోగ్యం


కిట్లు అందజేస్తున్న సర్పంచ్ ప్యారీజాన్

కలకడ: పారిశుద్ధ్య కార్మికుల చేతుల్లోనే ప్రజారోగ్యం ఉందని, పంచాయతీని పరిశుభ్రంగా ఉంచాలని సర్పంచ్ ప్యారీజాన్ కోరారు. కలకడ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి కోటకొండ దేవేంద్రతో కలిసి పంచాయతీ కార్మికులకు గురువారం నిత్యావసర పరిశుభ్రత కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రోజువారీ చెత్తసేకరణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన వాహనం వీధుల్లోకి వస్తుందని, పొడిచెత్త, తడిచెత్త వేరు చేయడం, సేంద్రీయ ఎరువులు తయారుచేసి రైతులకు సరఫరా చేయడం ప్రారంభించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జావాద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె మండల కేంద్రంలో గురువారం పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఎంపీడీఓ బాపూజీ పట్నాయక్ ఆదేశాల మేరకు కార్యదర్శి శ్రీనివాసులు గురువారం రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు తొలగించారు. కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు.

విధి నిర్వహణలో జాగ్రత్తలు అవసరం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం

మదనపల్లె రూరల్: సబ్ స్టేషన్లలో డ్యూటీ ఆపరేటర్లు విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం తెలిపారు. పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మదనపల్లె డివిజన్‌లోని డ్యూటీ షిఫ్ట్ ఆపరేటర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ సబ్ స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్ ఫార్మర్ల వద్ద ఫ్యూజులు వేయడంలో డ్యూటీ ఆపరేటర్లు నైపుణ్యం ప్రదర్శించాలన్నారు. సురక్షిత పరికరాలు, వస్తువులు ఉపయోగిస్తూ ముందు జాగ్రత్తలు తీసుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. ఏదైనా పరికరంపై పనిచేసే ముందు దానిని లాక్‌చేసి, ట్యాగ్ చేయడం తప్పనిసరి అన్నారు. ఏదైనా స్విచ్చింగ్ ఆపరేషన్ లేదా మెయిన్‌టెన్స్ పనులు చేసే ముందు ఎస్పీడీసీఎల్ అధికారులు, ఉద్యోగులకు సమాచారం ఇచ్చాకే పనిచేయాలన్నారు. ఆపరేటర్లు ప్రథమచికిత్స, విద్యుత్ షాక్ బాధితులను రక్షించే విధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమయపాలన పాటిస్తూ, రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఈ ఈఈ దామోదం, టీపీ ఈఈ విజయభాస్కర్, ఏడీఈలు హరికుమార్, సురేంద్రనాయక్, ఆదినారాయణ, ఏఈలు అజయ్ బాబు, రఫీ, కుమార్‌బాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యను దూరం చేస్తే ప్రజలు క్షమించరు

వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు చింతల రామచంద్రారెడ్డి


సంతకాల సేకరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం): పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య అందివ్వడానికి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి తీసుకు వచ్చిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తోందని, వైద్య విద్యను పేదలకు దూరం చేస్తే ప్రజలు క్షమించరని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురం మండలం వడ్డిపల్లి, అయ్యవారిపల్లిలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలు, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీను మంజూరు చేశారని, కూటమి ప్రభుత్వం వాటిని సంతలో సరకులు అమ్మినట్లు ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారని చింతల ఆవేదన వ్యక్తం చేశారు.

డైవర్షన్ రాజకీయాలకు పేరు చంద్రబాబు

రాష్ట్రంలో సంచలనంగా మారిన కల్తీ మద్యం కేసు నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి సీఎం చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే విమర్శించారు. కల్తీ మద్యం తయారు చేసి పక్కా ఆధారాలతో కూటమి నేతలు పట్టుబడితే... వారిపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం వారిని కాపాడడానికి వైఎస్సార్‌సీపీ నేతలపై నింద వేసి రాజకీయం చేయడంతో రాష్ట్ర ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారన్నారు. రైతులు పండించిన వరి, టమాటా, మామిడి, బొప్పాయి, ఉల్లి ఇలా ఏ పంటకు కూడా గిట్టుబాటు ధరలు లేక నష్టాలపాలవుతున్నా ఏనాడు ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వ కుటిల రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలోనే ఇంతటి ప్రజావ్యతిరేకత మూటకట్టుకున్న కూటమి ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ధిచెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతల శివానందరెడ్డి, పులిశివకుమార్‌రెడ్డి, భాస్కర్, అబ్దుల్‌కలీం, శ్రీధర్ రాయల్, జయచంద్ర, రెడ్డెప్పరెడ్డి, చిన్నోడు, ఎల్లారెడ్డి, నరసింహులు, చంద్రశేఖర్, నాగార్జున, సురేష్‌కుమార్ రెడ్డి, ఆనంద్, రవి, రఘు, రాజాబాబు, రాయుడు, చలపతి, శ్రీరాములు, రమణ, మోహన్‌రెడ్డి, శేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె రూరల్: ఎస్వీ యూనివర్సిటీ ఇంటర్ కొలిజియేట్ క్రీడల్లో పట్టణంలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారని ప్రిన్సిపల్ సురభి రమాదేవి అన్నారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఆమె అభినందించి మాట్లాడుతూ ఖోఖో పోటీల్లో ఎస్వీ యూనివర్సిటీ కళాశాలపై విజయం సాధించి, ఫైనల్స్‌లో ఎస్పీడబ్ల్యూ కళాశాలతో పోరాడి రన్నర్‌గా నిలిచారన్నారు. మహిళా విద్యా కళాశాలలో జరిగిన బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ఈ పీడీలు శరత్‌కుమార్, జగదీష్ పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన

రైల్వేకోడూరు : రైల్వేకోడూరులోని స్థానిక డిగ్రీ కళాశాల నందు బుధవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 286 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 122 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు వైవీయూ డీన్ ప్రొఫెసర్ రఘు బాబు తెలిపారు. ప్రిన్సిపల్ పెంచలయ్య, శ్రీనివాసులుపాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


అధ్యాపకులతో ఎంపికైన విద్యార్థులు

మదనపల్లె సిటీ: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థినులు కుసుమ, రోహిణి ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి అండర్–19 బాలికల హ్యాండ్‌బాల్ జట్టుకు ఇద్దరు విద్యార్థినులు ఎంపిక అయ్యారని తెలిపారు. పీడీ మురళీధర్‌రెడ్డి ప్రత్యేక శిక్షణ ఇచ్చారని, చదువుతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.


అధ్యాపకురాలితో వాలీబాల్ క్రీడాకారిణులు

వాలీబాల్ పోటీలకు...

రామసముద్రం: ఉమ్మడి చిత్తూరు జిల్లా పలమనేరులో నిర్వహించిన అండర్–19 వాలీబాల్ జిల్లా స్థాయి పోటీల్లో రామసముద్రం ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపల్ మునిస్వామి నాయక్ తెలిపారు. ఆదర్శ పాఠశాలకు చెందిన ఎస్.అర్చన(ఎంపిసి), నోమిషా(బైపిసి)రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్లు చెప్పారు. వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిప, ఉపాధ్యాయలు, పీడీ ఇందిర, పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు అభినందించారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఉపశమనం


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పీలేరు: ఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఉపశమనం కలిగిందని మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ టి.విజయకుమారి అన్నారు. పీలేరు పట్టణంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వాహన రంగంపై పన్ను భారాన్ని తగ్గించే దిశగా జీఎస్టీ సడలింపులు చేయడం జరిగిందన్నారు. డ్రైవర్లు, చిన్న వ్యాపారుల జీవనోపాధికి ఊతమిచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి, ఎ.చందన, జ్యోతి, టి.శ్వేత, ఎం.స్వాతి, బి.విష్ణు ప్రియ, బి.లీల, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ ధర్నా

కలకడ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతియుత నిరసన, ధర్నా చేపడుతున్నట్లు ఆ సంఘం మండలశాఖ అధ్యక్షుడు హరినాథ్ తెలిపారు. కలకడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్.గవాయ్‌పై దేశ అత్యున్నత న్యాయస్థానంలోనే లాయర్ ప్రశాంత్‌కిషోర్ దాడిచేయడం దారుణమన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ పిలుపుమేరకు కలకడ తహసీల్దారు కార్యాలయం ఎదుట జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదివేటి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోయినపల్లి గంగమ్మ జాతర

– మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


గంగమ్మతల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : గంగమ్మ తల్లి జాతరను మండలంలోని కె.బోయినపల్లిలో గురువారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ప్రతి కుటుంబంలోని వారు తమ బంధువులు, స్నేహితులను ఇతర రాష్ట్రాల నుంచి సైతం కబురు పంపి ఆహ్వానించారు. వేల సంఖ్యలో భక్తులు బోయినపల్లికి రావటంతో అక్కడ భక్తి బావం వెదజల్లింది. గంగమ్మకు జేజేలు పలుకుతూ మొక్కులు చెల్లించుకున్నారు. ఇదే క్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఈ వేడుకలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, అన్నమాచార్య యూనివర్సిటీ ప్రో చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డిలతో కలిసి విచ్చేసిన ఎమ్మెల్యే ఆకేపాటికి నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గంగమ్మతల్లి దీవెనలతో ప్రజలంతా చల్లంగా ఉండాలని పూజలు చేసినట్లు ఎమ్మెల్యే ఆకేపాటి తెలియజేశారు. ఈ వేడుకలలో అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.